క్లుప్తంగా

నేడు కృష్ణవరంలో ఎమ్మెల్యే పర్యటన

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరంలో గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పర్యటిస్తారని ఎంపీపీ తోట రవి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, వాటర్ ట్యాంక్‌లను ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

గండేపల్లి: రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన వర్తించాలంటే ఈ నెల 31 లోగా ప్రతి రైతు కచ్చితంగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మండల పరిధిలో 6,836 మంది రైతులకు గాను ఇప్పటివరకూ 5,911 మంది ఈ-కేవైసీ ని చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

న్యాయవాదుల నిరసన

తుని: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నిర్వహించే న్యాయవాదుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అనూహ్య కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం తుని దివాణం వీధిలోని జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. దళిత, ఆదివాసీ, వెనుకబడిన తరగతులకు చెందిన న్యాయవాదులకు నెలకు రూ.10 వేల ఉపకార వేతనం , జూనియర్ న్యావాదులకు మూడేళ్ల పాటు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలి

తుని: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు మందపల్లి సత్యనారాయణ కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం తుని నియోజకవర్గ ఏపీఎమ్మార్పీఎస్ సమావేశం పలివెల శివమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చర్మకారులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుపై తీర్మానం చేయాలని ఆయన కోరారు. నాయకులు టి.రమేష్, డి.చిన్న, కాకాడ జ్యోతికుమార్ పాల్గొన్నారు.


రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

గోకవరం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు నూరుశాతం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సుమారు 200 కేజీల విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు పొలం గట్లపై ఎకరాకు పావు కేజీ విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన దాడుల్లో 33 లీటర్ల సారాతో ముగ్గురిని అరెస్టు చేసి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో ఐదు లీటర్ల సారాతో కందిపల్లి నాగు, గజ్జనపూడిలో మూడు లీటర్ల సారాతో గారా పార్వతిని అరెస్టు చేశామన్నారు. రౌతుపాలెం ఏలేరు ఎడమ కాల్వ గట్టుపై పెదశంకర్లపూడి నుంచి కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి బైక్‌పై సారా తరలిస్తున్న పెద్దిపాలెం గ్రామానికి చెందిన చిన్ని ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 25 లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


దుర్గా భవానీ (ఫైల్)

తుని: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుని 28వ వార్డు కొత్తపేటకు చెందిన చోడ్రాజు దుర్గా భవానీ(36) ఆంజనేయ స్వామి గుడి సమీపంలో డ్రీమ్ వరల్డ్ ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తోంది. ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త సురేష్‌కుమార్, కటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను సంప్రదించారు. ఆమె సమాచారం తెలియకపోవడంతో భర్త సురేష్‌కుమార్ బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుర్గా భవానీ వివరాలు తెలిస్తే 94407 96572, 08854 253333 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

గ్రామ వలంటీర్లు... సేవా సారథులు

గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. వలంటీర్ అనే పదం సేవలకు పర్యాయ పదంగా మారింది. ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రజల ఇంటికే ప్రభుత్వ సేవలను అందిస్తోంది. వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు యేఏ పథకాలు వర్తిస్తాయో వివరించి వారితో దరఖాస్తు చేయించి పథకాల లబ్ధి పొందేలా చేస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు తలుపుతట్టి పింఛన్లు అందిస్తున్నారు. ప్రజలకు అవసరమైన పలు రకాల సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసి ఇంటికే వాటిని తెచ్చి ఇస్తున్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు ప్రాణాలను లెక్క చేయకుండా సేవలందించారు. గ్రామ వలంటీర్ల ద్వారా తమకు అందుతున్న సేవలపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– కిర్లంపూడి



ఠంచన్‌గా పింఛన్



గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగలేక ఒళ్లునొప్పులు వచ్చేవి. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ప్రతినెలా 1వ తేదీ లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛను అందుతోంది. మా వలంటీర్ మళ్ల ఆనంద్ కుమార్ ప్రతినెలా ఒకటో తేదీన వేకువజామునే వచ్చి రూ.2750 అందజేస్తున్నాడు. ఇంకా ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుకుంటున్నాడు. మా కుటుంబంలో ఒకరిగా కలిసిపోయి మాకు సేవలందిస్తున్నాడు.

– యల్లపు రమణ, జగపతినగరం, కిర్లంపూడి మండలం

ఇంటికే ప్రభుత్వ పథకాలు



గతంలో ప్రభుత్వ పథకాలు ఎన్ని ఉన్నాయో మాకు తెలిసేది కాదు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. మా వలంటీర్ ద్వారా మాకు వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, రుణమాఫీ పథకాలు అందుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో వీరు కీలకపాత్ర వహిస్తున్నారు. వలంటీర్ల చేస్తున్న సేవలు వెలకట్టలేనివి.

– మళ్ల రత్నం, నర్సయ్యపేట, కిర్లంపూడి మండలం

ఇంటి స్థలం మంజూరైంది



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం అనేక సార్లు దరఖాస్తులు చేశాం. ఎన్నిసార్లు అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక వలంటీర్ సరిసే కన్యకా పరమేశ్వరి మా ఇంటికి వచ్చింది. ఇళ్ల స్థలానికి దరఖాస్తును పూర్తి చేయించి తీసకువెళ్లింది. అనంతరం 90 రోజుల్లో మాకు ఇంటి పట్టా వచ్చింది. జగనన్న ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉన్నాం.

– రాపేటి రమ, కిర్లంపూడి మండలం

వలంటీర్ల సేవలు అభినందనీయం



గత ఏడాది నాకు 60 ఏళ్లు పూర్తయ్యాయి. మా వలంటీర్ ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకుని నాకు పింఛను వచ్చేలా కృషి చేశాడు. అలాగే ప్రతి నెలా 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నాడు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు మాకు వివరిస్తున్నాడు. గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయం.

–వాడకట్టు నాగేశ్వరరావు, నర్సయ్యపేట, కిర్లంపూడి మండలం

మత్తు పదార్థాల నివారణపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు

గోకవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని ఎస్సీబాలుర వసతి గృహంలో విద్యార్థులకు డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, ఏఎస్సై టీవీ రెడ్డి, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణాలు మంజూరు చేయాలి

కోటనందూరు: రైతులకు రుణాలు మంజూరు చేయాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ బ్యాంకు అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏఓ చంద్రశేఖర్ అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం జరిగింది. స్థానిక ఎస్‌బీఐ, చైతన్య గోదావరి, భీమవరపుకోట కెనరా, పాతకొట్టాం యూనియన్ బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలురైతులకు రుణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పశువైద్యాధికారి రత్నతేజ మాట్లాడుతూ పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆవులు, గేదెలు కొనుగోలు చేసుకునేందుకు పాడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల్లో భాగంగా లబ్ధిదారులకు జగనన్న తోడు, ఇంటి రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివకుమారి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు

గండేపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే కౌలు రైతులకు రుణాలు అందజేయాలని మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి రత్నతేజ

ప్రతి కౌలుదారుడికి పంట రుణం ఇవ్వాలి

తుని రూరల్: పంటల సాగు చేస్తున్న ప్రతి కౌలుదారుడికి పంట రుణం ఇవ్వాలని బ్యాంకర్లకు వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్లు, వ్యవసాయ, డీఆర్‌డీఏ, వెటర్నరీ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు రుణాలను అందించాలన్నారు. అర్హులైన క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సీసీఆర్సీ), పశు కిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ) దారులకు రుణాలు ఇవ్వాలన్నారు. పాడిపంటలను ప్రోత్సహించేందుకు రుణాలు ఎంతో ముఖ్యమన్నారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్, ఏడు బ్యాంకులకు చెందిన మేనేజర్లు పాల్గొన్నారు.


తుని బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బుల్లిబాబు

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

శంఖవరం: కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు సహకరించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ, ఉద్యానశాఖాధికారి ప్రసాద్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధ బ్యాంకుల అధికారులు, వ్యవసాయ, ఉద్యానశాఖ, పశుసంవర్ధనశాఖ, రైతుభరోసా సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రత్తిపాడు: గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (పీఆర్ ఎస్ఈ) పి.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సచివాలయాల వారీగా జరుగుతున్న భవన నిర్మాణాల స్థితిగతులపై ఆయన సమీక్షించారు. మండలంలో 26 సచివాలయాల్లో 15 సచివాలయ భవనాలు, నాలుగు రైతు భరోసా కేంద్రాలు, ఆరు వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.నాగేశ్వరరావు వివరించారు. పెద్దాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కేఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు

రత్నగిరిపై చురుగ్గా మెట్ల విస్తరణ పనులు

అన్నవరం: రత్నగిరిపై మెట్ల విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఇరువైపులా ఉన్న మెట్లను విశాలం చేస్తున్నారు. స్వామివారి ఆలయానికి ఇరువైపులా ఇప్పటివరకూ మూడు అడుగుల వెడల్పున మెట్లు ఉన్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మెట్ల ద్వారా వెళ్లేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ మెట్లను మరో రెండు అడుగులు విస్తరిస్తున్నారు. ఇప్పటికే ఎడమ వైపు మెట్లను విస్తరించారు. వాటిపై గల షెడ్‌ను తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం కుడి వైపు మెట్ల విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మూడు అడుగులతో పాటు మరో రెండు అడుగుల వెడల్పున మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మెట్ల నిర్మాణం పూర్తయితే రెండు వరుసల్లో భక్తులు రాకపోకలు సాగించవచ్చునని ఈఈ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.


సత్యదేవుని ఆలయం వద్ద ఎడమ వైపు రెండు అడుగుల మేర విస్తరించిన మెట్లు

జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, సేవలు సత్వరమే వారికి చేరుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 16, 23 వార్డులకు సంబంధించి గవరపేట సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పొమర్తి మహేష్, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు కన్నూరి మంగ, కర్రి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


తునిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి


జగపతినగరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

రౌతులపూడి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. మండలంలోని పారుపాకలో ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పక్కుర్తి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గెద్దం వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు జయబాబు, దివాణం, శ్రీను, తహసీల్దార్ బి.భీమారావు, డీటీ పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అర్హులందరికీ మేలు చేకూరుతుందని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. జగపతినగరం సచివాలయం-4 పరిధిలో బుధవారం ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శ్రీలత లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీటీసీ కాళ్ల దొంగబాబు, కురుమళ్ల చిన్ని, గుడాల రాంబాబు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే..

తుని రూరల్: పేదల సంక్షేమానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహిస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. దొండవాకలో బుధవారం సర్పంచ్ లంక లక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎంపీపీ రాము ధ్రువపత్రాలను అందజేశారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ లంక పార్వతి, ఎంపీడీఓ పి.రవికుమార్, ఉప సర్పంచులు మేడిశెట్టి శ్రీను, మదాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరపుకోటలో..

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో సర్పంచ్ జిగటాల వీరబాబు అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ జగదీష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ జె.శివరామకృష్ణ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు కొల్లు సత్తిబాబు, తోట నాగజ్యోతి, వైస్ సర్పంచ్ గౌతు నాగు, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్ర లచ్చారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బుధవారం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్పంచ్ సుశీల, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, వైఎస్సార్ సీపీ నేత జువ్వల బాబులు ధ్రువపత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పారుపాకలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రమణమ్మ


దొండవాకలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


భీమవరపుకోటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు


ధర్మవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పవన్ వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్ల ధర్నా


కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లో పవన్ కల్యాణ్ పోస్టర్లను దహనం చేస్తున్న వలంటీర్లు

కిర్లంపూడి: గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కిర్లంపూడిలో వలంటీర్లు ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏనుగువీధి సెంటర్ వరకూ ర్యాలీ చేసి పవన్ కల్యాణ్ పోస్టర్లను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందుతున్నాయన్నారు. నెలకు రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తమపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు.

పురోహితుల కోసం వేలంపాట హాస్యాస్పదం

ఏలేశ్వరం: అన్నవరం దేవస్థానంలో పెళ్లిళ్లు నిర్వహించే పురోహితుల కోసం వేలంపాట నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని మండల వేదగాయత్రి బ్రహ్మణసంఘ సమాఖ్య పేర్కొంది. పురోహితుల సరఫరా కోసం బహిరంగ వేలం నిర్వహించడాన్ని సమాఖ్య తీవ్రంగా ఖండించింది. ప్రజలకు తమకు నచ్చిన పురోహితులతో వివాహం జరిపించుకోనే స్వేచ్ఛ ఉందని, దీనిని భిన్నంగా వేలంపాట నిర్వహించడం సరికాదని సమాఖ్య సభ్యులు తెలిపారు. దీనిపై అధికారులు తమనిర్ణయం ఉపసంహరించుకోవాలని సమాఖ్య కోరింది.

వ్యవసాయ బోర్ల మోటారు వైర్లు చోరీ

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో వ్యవసాయ బోర్లకు అమర్చిన విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. కొమ్మనాపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని దుండుగులు సుమారు 50 బోర్ల వైర్లను చోరీ చేశారు. కొద్ది రోజులు క్రితం కోదాడ పరిసర ప్రాంతాల్లో ఇదే తరహా చోరీ జరిగింది. గతంలో కూడా కొమ్మనాపల్లిలో వ్యవసాయ బోర్ల వైర్లు చోరీరి గురయ్యాయని బాధిత రైతులు వాపోతున్నారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


తునిలో డెంగీ నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుని: ప్రస్తుత సీజన్‌లో డెంగీ వ్యాధి సోకే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. పట్టణంలోని 4వ వార్డులో ప్రజలకు బుధవారం డెంగీ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల మధ్య డ్రమ్ములు, పెద్ద పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్, ఖాళీ కొబ్బరి బొండాలను నివాస ప్రాంతాల్లో ఉంచవద్దని ప్రయా ఆరోగ్యశాఖ అధికారి శేఖర్ సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

తుని: ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు కోరారు. స్థానిక సీతారాంపురంలో బుధవారం సాయంత్రం వారధి కార్యక్రమం నిర్వహించారు. చదువుకునే పిల్లలకు మోటారు సైకిళ్లు కొని ఇవ్వడం, వారు ఎక్కడికి వెళుతున్నారో గమనించక పోవడంతో వేగంగా వాహనాలను నడిపి ప్రజలను గాయాలు పాలు చేస్తున్నారన్నారు. కొందరు యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. పిల్లల బాధ్యతను తల్లిదండ్రులు తీసుకుంటే వారి భవిష్యత్ బాగుంటుందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గండేపల్లి: సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ సూచించారు. మండలంలోని పి.నాయకంపల్లిలో బుధవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

కొమ్మాది: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై, అప్పు తీర్చలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీచ్‌రోడ్డు తిమ్మాపురంలోని బీఎంఆర్ హేచరీలో అసిస్టెంట్ టెక్నీషియన్‌గా కొమ్మిరెడ్డి శేఖర్(26) విధులు నిర్వహిస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తుంటాడు. క్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంగా మారింది. దీంతో శేఖర్ తలకు మించి అప్పులపాలయ్యాడు. ఈ అప్పులు తీర్చలేక ఒత్తిడి గురై అదే హేచరీలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనది కాకినాడ జిల్లా పత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం. కొన్నాళ్ల కిందట బీఎంఆర్ హేచరీలో అసిస్టెంట్ టెక్నీషియన్‌గా చేరాడు. తన చావుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని రాసిన సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీమిలి ఎస్ఐ భరత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.